RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ గురువారం 09.04.2026 సంపుటి:03 సంచిక:123 పేజీలు:08 వెల : 05
Karimnagar Thursday 09.04.2026 Volume : 03 Issue : 123 Pages : 08 Cost : 05

తెలుగు దినపత్రిక

మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు
బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి
వాట్సాప్ చేయండి:8074124190




మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

## రెండు తెలుగు రాష్ట్రాల్లో




అశేష పాఠకాదరణ పొందిన
వాస్తవం డిజిటల్ పత్రిక
ఆర్ఎన్ఐ అనుమతులున్న
జనోదయ ప్రింట్ పత్రికలకు

రాజకీయ,
ఆర్థిక,సామాజిక,సాహిత్య
వ్యాసాలతోపాటు
ఇతర వార్తల కవరేజీ
సమాచారాన్ని పంపడానికి

## ఆహ్వానం

8074124190
9618616110

## మానసాని కృష్ణా రెడ్డి

వాస్తవం,జనోదయ
తెలుగు దినపత్రికల
ప్రధాన సంపాదకులు

**Manasani Krishna Reddy**



## కొలనూరులో సన్న బియ్యం పంపిణీపై ఎంపీ వంశీకృష్ణ ఆకస్మిక తనిఖీ



**జనోదయ, మంథని ఏప్రిల్ 08:**
పెద్దపల్లి జిల్లా కొలనూరులో రేషన్ దుకాణాన్ని ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేసి సన్న బియ్యం పంపిణీ తీరును సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణంలో ఉన్న బియ్యం నిల్వలు, నాణ్యత, పంపిణీ విధానం గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరుకులు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. తనిఖీ సందర్భంగా అక్కడికి వచ్చిన లబ్ధిదారులతో ఎంపీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కొంతమంది లబ్ధిదారులు సరఫరాలో ఆలస్యం, కొలతల విషయంలో అనుమానాలు వ్యక్తం చేయగా, వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రేషన్ దుకాణాల నిర్వహణలో పారదర్శకత ఉండాలని, నాణ్యమైన బియ్యం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని ఆయన హెచ్చరించారు. అక్రమాలు లేదా అవినీతి జరిగితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ సరుకులు సమర్థవంతంగా అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# రాజకీయ ఒత్తిళ్లకు భయపడే దాన్ని కాను

## సుద్దాల సర్పంచ్ డోంగిరి స్వప్న

**జనోదయ చెన్నూర్ ఆర్ సి ఏప్రిల్ 08:**
గ్రామ అభివృద్ధి విషయంలో రాజకీయ భేదాలు పక్కనపెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని గ్రామ సర్పంచ్ శివంగి పిలుపునిచ్చారు. తాను సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి కొంతమంది తనపై కక్ష సాధించే ప్రయత్నాలు చేస్తున్నారని, వారు కూడా తమ గ్రామ ప్రజలేనని గుర్తుంచుకోవాలని ఆమె పేర్కొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా తాను చేపట్టిన కార్యక్రమాలను చూసి పెద్దలు ప్రశంసించారని, గ్రామ అభివృద్ధి కోసం తన నిబద్ధతను అందరూ అర్థం చేసుకోవాలని ఆమె అన్నారు. “నేను మీ సర్పంచ్‌ని అనే విషయం గుర్తుపెట్టుకొని, మన ఊరికి ఏమి అవసరమో మనందరం కలిసి నిర్ణయించుకోవాలి” అని ఆమె స్పష్టం చేశారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ వంటి ప్రాథమిక సదుపాయాల అభివృద్ధి అత్యవసరమని పేర్కొంటూ, ఇసుక వినియోగంపై వస్తున్న ఆరోపణలను ఖండించారు. “నేను వాగు నుంచి తీసే ఇసుకను వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదు, గ్రామ రోడ్లు మరియు డ్రైనేజీల నిర్మాణం కోసం మాత్రమే ఉపయోగిస్తున్నాను. ఇది అందరికీ తెలిసిన విషయమే” అని తెలిపారు. మునుపటి సర్పంచ్‌లకు గౌరవం ఉందని,



వారు కూడా తమ వంతు కృషి చేశారని అంగీకరించిన ఆమె, ప్రస్తుతం గ్రామ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. “మనమంతా అన్నదమ్ముల్లా, అక్కచెల్లెల్లా కలిసి ఉంటేనే గ్రామం అభివృద్ధి చెందుతుంది. నాకు ఎవరి మీద కోపం లేదా ద్వేషం లేదు. సమస్యలు ఉంటే నేరుగా నాతో మాట్లాడండి, నేను మీకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాను” అని సర్పంచ్ శివంగి అన్నారు. గ్రామ ప్రజలందరూ అభివృద్ధి కార్యక్రమాల్లో సహకరించాలని ఆమె కోరారు.

# నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా 'ఖని'లో ఇఫ్టు నిరసన

**జనోదయ గోదావరిఖని, ఏప్రిల్ -08:**
కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులను రద్దుచేసే వరకు పోరాటం కొనసాగిస్తామని ఏప్రిల్ 8న ప్రతిజ్ఞ దినంగా పాటించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టు) జాతీయ కమిటీ పిలుపు మేరకు జిడికె2ఏ గని వద్ద కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి లేబర్ కోడ్ ల రద్దు అయ్యే వరకు నిరంతర పోరాటం కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అలాగే గోదావరిఖని పైలాన్ చౌరస్తా వద్ద ఇఫ్టు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన తెలుపుతూ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని నిరంతరం పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఇఫ్టు రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ, జిల్లా అధ్యక్షులు ఈ నరేష్ మాట్లాడుతూ 1929 ఏప్రిల్ 8న బ్రిటిష్ పార్లమెంటులో షహిద్ భగత్ సింగ్,బట్కేశ్వర్ దత్తులు పొగబాంబు లు వేశారని, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు దేశంలో కార్మిక పోరాటాలను,ప్రజా పోరాటాలను అణిచివేసేందుకు నిర్బంధ చట్టాలను ప్రవేశపెట్టిన సందర్భంగా బాంబులను వారు విసిరారని వివరించారు. పిడికెడు మంది కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం,పెట్టుబడిదారుల సంపద పెంపు కోసం 50 కోట్ల మంది కార్మికుల రక్త మాంసాలను దోచి పెట్టేందుకు నాలుగు లేబర్ కోడుల ను రూపొందించారని దాని స్థానంలో కార్మిక వర్గం పోరాడి సాధించిన 29 కార్మిక చట్టాలను రద్దు చేశారన్నారు. కార్మిక వర్గానికి అత్యంత ప్రమాదకరమైన దుర్మార్గపు మోడీ లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా లేబర్ కోడ్ల రద్దు కోసం నిరంతరం పోరాడడానికి సిద్ధంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఇఫ్టు ప్రధాన కార్యదర్శి బి అశోక్, నాయకులు ఈదునూరీ రామకృష్ణ, ఐ రాజేశం, ఎం దుర్గయ్య, పి మొండయ్య, ఎస్ ప్రసాద్, పోగుల శేఖర్, కే ఎల్లయ్య, ఎండి యూసుఫ్, ఎడ్ల రవికుమార్, బి రాజనర్స్, దుర్గం పోశం, ఐ సాంబయ్యలతో పాటు 100 మంది పాల్గొన్నారు.




# సమాజానికి చేసిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి

## మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**జనోదయ, మంథని,, ఏప్రిల్ 08:**
మనిషి జీవితంలో కుటుంబానికి, సమాజానికి చేసిన సేవలే చిరస్మరణీయంగా నిలుస్తాయని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంథని మండలం చిల్లపల్లి గ్రామంలో మాజీ ఎంపీటీసీ పిక్కల పెద్ద రాజయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆయన, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ, నేటి సమాజంలో బంధుత్వాలు తగ్గుతున్న తరుణంలో రాజయ్య కుటుంబం ఆయన జ్ఞాపకాలను నిలుపుకోవడం అభినందనీయమన్నారు. రాజయ్య జీవితం కుటుంబం, గ్రామం పట్ల ప్రేమాభిమానాలకు నిదర్శనమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాట్లాడుతూ, జన్మనిచ్చిన తల్లిదండ్రులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రాజయ్యతో 15 ఏళ్ల పాటు కలిసి పనిచేశానని, గ్రామాభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



# మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ ను కలిసిన పి ఆర్ టి యు తెలంగాణ రాష్ట్ర కమిటీ

## ప్రతి ప్రాథమిక పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిని నియమించాలి

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్

**జనోదయ, హనుమకొండ,, ఏప్రిల్ 08:**
రాష్ట్రంలోని ప్రతి ప్రాథమిక పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిని నియమించాలని కోరుతూ పిఆర్టియు తెలంగాణ రాష్ట్ర కమిటీ పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు మరియు యువజన సర్వీస్‌ల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్‌ను హైదరాబాద్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసింది. విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం దృష్ట్యా ఈ నియామకాలు అత్యవసరమని సంఘం ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు యోగ, వ్యాయామం అలవాటు చేయడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. అందుకే ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా వ్యాయామ ఉపాధ్యాయుడిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్లా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రావుల కార్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యా వ్యవస్థలో శారీరక విద్యకు ప్రాధాన్యం పెంచాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.



# సంక్షేమ పథకాల ద్వారా ప్రతి వర్గానికీ ప్రభుత్వం సహాయం అందిస్తుంది

## –రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

## –వికలాంగులకు స్కూటీలు, అంగన్వాడీలకు 5జి మొబైల్స్ అందజేత

**జనోదయ గోదావరిఖని, ఏప్రిల్ 08 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వికలాంగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 18 స్కూటీలు, 7 ల్యాప్‌టాప్‌లు, 1 ఆధునిక 5G మొబైల్, 2 టాబ్‌లను పంపిణీ చేశారు. ఈ పరికరాలు వికలాంగులకు స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించి, వారి జీవితాల్లో కొత్త ఆశలు నింపుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో 203 మంది అంగన్వాడీ సిబ్బందికి 5జి మొబైల్స్‌ను అందజేశారు. ఈ సాంకేతిక పరికరాల ద్వారా సేవలు వేగవంతంగా, పారదర్శకంగా ప్రజలకు అందుతాయని తెలిపారు. ఇదే కార్యక్రమంలో స్థానిక 37వ డివిజన్‌కు చెందిన ఒక ఆయా సిబ్బందికి అంగన్వాడీగా పదోన్నతి కల్పించడం ద్వారా వారి సేవలను గుర్తించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ప్రతి వర్గానికీ సహాయం అందిస్తూ, ముఖ్యంగా వికలాంగులు మరియు మహిళా సిబ్బంది ఆత్మనిర్భరత సాధించేలా చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# జె ఎస్ ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు గా ఎం డి ఆదిల్, ప్రధాన కార్యదర్శిగా పోశాలబిక్షపతి గౌడ్



ఎం డి ఆదిల్



పోశాలబిక్షపతి గౌడ్

**హనుమకొండ (జనోదయ) ఏప్రిల్ 08:** ఉమ్మడి వరంగల్ జిల్లా జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ యందు జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు మనసాని కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రోజునా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ఉమ్మడి వరంగల్ జిల్లా జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా ఎం డి ఆదిల్ ను ,ప్రధాన కార్యదర్శి గా పోశాల బిక్షపతి గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా ఎం డి ఆదిల్ మాట్లాడుతూ నా పై నమ్మకం తో నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న జె ఎస్ ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి జర్నలిస్ట్ మిత్రులకు ఏ ఆపద వచ్చిన ముందు ఉండి కొట్లాడతానని, పాత్రికేయ మిత్రుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తాను అన్నారు.

# టేకుల బస్తీలో పర్యటించిన మున్సిపల్ కమిషనర్

**జనోదయ, బెల్లంపల్లి, ఏప్రిల్ 08:**

బెల్లంపల్లి పట్టణంలోని 15వ వార్డులో బుధవారం మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి పర్యటించారు. టేకుల బస్తీలో పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను స్థానిక కౌన్సిలర్ చింతల వసంత కమిషనర్ సంపత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీ పూడిక తీపించాలని, వార్డులో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను తొలగించాలని ఆమె కమిషనర్ ను కోరారు. టేకుల బస్తీలో అవసరమున్న ప్రతి చోట సీసీ రోడ్డు మంజూరు చేయాలని, విద్యుత్ స్తంభాలు వేయించాలని కోరారు. 15వ వార్డు లో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్లు ఇవ్వాలని ఆమె కమిషనర్ సంపత్ రెడ్డిని కోరారు. సమస్యలపై స్పందించిన కమిషనర్ సంపత్ రెడ్డి త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి తీరుస్తానని చెప్పారు. వార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేసేలా స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా కలెక్టర్ లకు ప్రతిపాదిస్తానన్నారు. వార్డులో చెత్త సేకరణకు వచ్చే ఆటో ట్రాలీలో మాత్రమే ప్రజలు చెత్తను వేయాలని కోరారు. రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ సునీల్, జవాన్ లు ఇంద్రపాల్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడమే బాధ్యతగా భావిస్తాం - సర్పంచ్ సంగెం అరుణ గట్టయ్య



**మంథని: ఏప్రిల్ 8 (జనోదయ):**

మంథని మండల పరిధిలోని ఖానాపూర్ లో రోడ్డుపై గల చెత్తను తొలగించారు. 2వ వార్డ్ సభ్యులు రేగళ్ల సతీష్ గ్రామంలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం పై సర్పంచ్ కు సమాచారం అందించారు. దీనిపై వెంటనే స్పందించిన గ్రామ సర్పంచ్ సంగెం అరుణ గట్టయ్య తక్షణ చర్యలు తీసుకున్నారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రాక్టర్ సహాయంతో ఆ ప్రాంతంలోని చెత్తను పూర్తిగా తొలగించి శుభ్రపరిచారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం మా బాధ్యతగా భావిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మాజీ సర్పంచులకు ఘన సత్కారం

**జానోదయ డి హీరేహాళ్ ఏప్రిల్ 05:** మండల వ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని గ్రామపంచాయతీల మాజీ సర్పంచులకు బుధవారం నాడు మండల కేంద్రంలో ఉన్నటువంటి మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఘనంగా సత్కరించడం జరిగినది రాయదుర్గం మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి ఎంపీపీ పవిత్ర వన్నూరు స్వామి అధ్యక్షతన ఎంపీడీవో దాసానాయక్ ఆధ్వర్యంలో బుధవారం నాడు సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది ఈనెల 2వ తేదీన సర్పంచుల పదవీకాలం ముగిసిపోవడం జరిగినది. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్నటువంటి 16 గ్రామ పంచాయతీల మాజీ సర్పంచులకు ఈ సన్మాన సభ ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా మాజీ సర్పంచులకు శాలువా పూలమాలలతో సత్కరించి మెమొంటోను బహుకరించడం జరిగినది ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమత్ రెడ్డి మాట్లాడుతూ పదవి కాలం పూర్తిచేసుకున్న సర్పంచులు గ్రామ అభివృద్ధికి చేసిన సేవలు, ప్రజల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలు ఎంతో విలువైనవి. వారి కృషిని గుర్తిస్తూ గ్రామ ప్రజలు, అధికారులు కలిసి ఘనంగా సత్కరించడం ఒక మంచి సంప్రదాయం. ఈ సత్కారం ద్వారా వారి సేవలకు కృతజ్ఞతలు తెలియజేయడమే కాకుండా, భవిష్యత్ నాయకులకు కూడా ప్రేరణగా నిలుస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో నందు జడ్పిటిసి హసీనా బాను ఏవో బలరాం, ఈవోపీఆర్డి యోగానంద్, తాసిల్దార్ శ్రీనివాసులు,ఎంపీటీసీ గంగాధర,మల్లికార్జున మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మల్లికార్జున, సుదర్శన్ రెడ్డి హనుమంత రెడ్డి, పరమేష్,గంగన్న,పుష్పావతి ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు
బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి
వాట్సాప్ చేయండి:8074124190




మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

# మహిళలకు ఆరోగ్యంపట్ల అవగాహన కల్పించాలి – ఎంపీ డాక్టర్ కడియం కావ్య

-విద్య, వైద్యం ఎంతో విలువైనవి - ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.

-మాతృత్వం మహిళలకు గొప్ప వరం - మేయర్ గుండు సుధారాణి.




**హనుమకొండ: ఏప్రిల్ 08 (జనోదయ):** మహిళల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించడం అత్యంత అవసరమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సురక్షిత మాతృత్వ దినోత్సవం లో ఎంపీ తో పాటు నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..గర్భిణీ స్త్రీలు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు, ముఖ్యంగా గర్భస్థ శిశువులో లోపాలను గుర్తించే టిఫ స్కానింగ్‌ను నిర్దిష్ట సమయంలో తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. గర్భిణీల శారీరక ఆరోగ్యంతో పాటు ప్రసవానంతర దశలో మానసిక ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ అవసరమని చెప్పారు. సిజేరియన్ ప్రసవాల సంఖ్యను తగ్గించి, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ...సృష్టిలో మాతృత్వం అనేది మహిళలకు దేవుడిచ్చిన గొప్ప వరం అని అన్నారు. సీఎం మహిళా శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు.

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ..**

విద్య వైద్యం అనేవి ప్రపంచంలోనే ఎంతో విలువైనవని అన్నారు. సమస్యల పరిష్కారానికి 99 రోజుల కార్యక్రమాన్ని చేపట్టారని పేర్కొన్నారు. ఎంజీఎం ఆసుపత్రికి ప్రత్యామ్నాయంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి విషయమై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష చేస్తున్నామని పేర్కొన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అవసరమైన అన్ని వసతులు కల్పించి త్వరగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. సమావేశంలో సురక్షిత మాతృత్వానికి సంబంధించిన అంశాలపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

# ప్రజల ఆరోగ్య రక్షణ ప్రభుత్వానికి "అత్యంత ప్రాధాన్యం"

- – వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన
- – వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యా శారదా దేవి
- – వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు
- – అస్తవ్యస్త పరిస్థితులపై ఆగ్రహం – నిర్లక్ష్య సిబ్బందిపై కలెక్టర్ చర్యలకు ఆదేశాలు..

"ప్రజల ఆరోగ్యంతో ఎలాంటి నిర్లక్ష్యం సహించం... ప్రభుత్వ ఆసుపత్రులు నమ్మకమైన సేవలు అందించే కేంద్రాలుగా మారాలి" – కలెక్టర్ సత్యా శారదా దేవి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**జనోదయ వరంగల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 08:** వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని బుధవారం జిల్లా కలెక్టర్ సత్యా శారదా దేవి తో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వహణలో కనిపిస్తున్న అస్తవ్యస్త పరిస్థితులు మరియు సిబ్బంది నిర్లక్ష్యంపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ స్వయంగా ఆసుపత్రిలోని బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను పరిశీలించారు. విధులకు గైర్హాజరైన పలువురు వైద్యులు మరియు సిబ్బంది తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వారికి వెంటనే మెమోలు జారీ చేయాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యంతో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని వార్డులు మరియు పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై ఆమె తీవ్రంగా స్పందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను పిలిచి అక్కడికక్కడే మందలిస్తూ.. రోగులు నయం కావాల్సిన ఆసుపత్రి వాతావరణం ఇంత అపరిశుభ్రంగా ఉండటం అనేది అసహనీయమని పేర్కొన్నారు. వెంటనే పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాలని, లేకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అదేవిధంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆసుపత్రి వార్డులను సందర్శించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల సరఫరా, సిబ్బంది స్పందన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి రాజీ పడబోమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్య రక్షణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు నమ్మకమైన వైద్య సేవలు అందించే కేంద్రాలుగా ఉండాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు ఎమ్మెల్యే పేర్కొన్నారు.




# పోతు తాటి కల్లుకు భలే గిరాకీ వేసవి తాపానికి సరైన ఔషధం

## పోతుతాటి కల్లు సేవనంపై యువత మొగ్గు

**జనోదయ మంథని ఏప్రిల్ 08:** వేసవి కాలంలో ప్రకృతి ప్రసాదించిన సహజ సిద్ధమైన పానీయం తాటికల్లు. గ్రామీణ ప్రాంతాల్లో తాటి కల్లును అమృతంగా భావిస్తారు. సంవత్సర కాలంలో తాటి చెట్లను పరుపు తాళ్లు, పండు తాళ్లు, పోతు తాళ్లుగా విభజించి సీజన్ ల వారీగా గీస్తారు. అయితే ఈ మూడింటిలో ఏది ఆరోగ్యానికి మంచిది? అనే సందేహాలు చాలామందికి ఉంటాయి. ఈ రకాల తాటికల్లు పానీయాల మధ్య ఉన్న పోలికలు, వాటిలోని ఔషధ గుణాలు, వేసవిలో వీటిని తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకుందాం. పరుపుతాడు అందరూ వాడుతారు. కొందరికి ఇది విరేషనాలు కలిగిస్తుంది అని అంటుంటారు. పండు తాడు కమ్మని వాసన కలిగి ఉండి కల్లు సేవించే వారికి ఇంపుగా ఉంటుందని అంటుంటారు. అదే పోతు తాడు అందరూ ఇష్టంగా సేవిస్తారు. పోతు అనగా మగది అని కల్లు చాలా ఘాటుగా, రుచిగా, మత్తుగా ఉంటుందని



పెద్దలు చెపుతారు. పోతుతాడును అందరూ ఇష్టంగా తాగుతుండడంతో ఈ కల్లుకు బాగా డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా కిడ్నీ సమస్యలు, జీర్ణక్రియ మెరుగుదల వంటి విషయాల్లో ఇవి ఉపయోగపడతాయి.

ఎండలు ముదిరితే చాలు, ప్రజలు చల్లని పానీయాల కోసం వెతుకుతారు. కృత్రిమ కూల్ డ్రింక్స్ కంటే మన పల్లెటూర్లలో దొరికే తాటికల్లు, ఈతకల్లు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం. తాటి చెట్టు నుండి తీసే తాటికల్లు శరీరంలోని వేడిని తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. మరోవైపు, ఈత చెట్టు నుండి సేకరించే ఈతకల్లు తీయగా ఉండటమే కాకుండా అనేక పోషక విలువలను కలిగి ఉంటుంది.

ఈ రెండింటిలోనూ విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. కానీ వీటి మధ్య కొన్ని కీలక వ్యత్యాసాలు ఉన్నాయి.

ఎండలు ముదిరితే చాలు, ప్రజలు చల్లని పానీయాల కోసం వెతుకుతారు. కృత్రిమ కూల్ డ్రింక్స్ కంటే మన పల్లెటూర్లలో దొరికే తాటికల్లు, ఈతకల్లు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం. తాటి చెట్టు నుండి తీసే తాటికల్లు శరీరంలోని వేడిని తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. మరోవైపు, ఈత చెట్టు నుండి సేకరించే ఈతకల్లు తీయగా ఉండటమే కాకుండా అనేక పోషక విలువలను కలిగి ఉంటుంది. ఈ రెండింటిలోనూ విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. కానీ వీటి మధ్య కొన్ని కీలక వ్యత్యాసాలు ఉన్నాయి.



తాటికల్లు

### తాటికల్లు ప్రత్యేకతలు:

తాటికల్లులో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరానికి తక్షణమే చలవను ఇస్తుంది. వేసవిలో వచ్చే వడదెబ్బ నుంచి రక్షించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లను కరిగించడంలో తాటికల్లు సహాయపడుతుందని నమ్ముతారు. ఇది జీర్ణశక్తిని పెంచి, మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది.

### ఈత కల్లు ప్రత్యేకతలు

ఈతకల్లు రుచికి చాలా తీయగా ఉంటుంది. ఇందులో తాటికల్లు కంటే ఎక్కువ పోషక విలువలు ఉంటాయని నిపుణులు చెబుతుంటారు. శరీరానికి అవసరమైన ఐరన్, పొటాషియం వంటి ఖనిజాలు ఇందులో లభిస్తాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా, కంటి చూపు మెరుగుదలకు కూడా దోహదపడుతుంది.

### ఏది మంచిది?:

వేడి తగ్గించడానికి, మీరు శరీరాన్ని చల్లబరచాలని అనుకుంటే తాటికల్లు ఉత్తమ ఎంపిక. అదే పోషకాల కోసం, తీపి రుచితో పాటు శక్తి కావాలనుకునే వారు ఈతకల్లును ఎంచుకోవచ్చు. ప్రకృతి సిద్ధంగా దొరికే ఈ పానీయాలు మితంగా తీసుకుంటే ఔషధంగా పని చేస్తాయి.

### తీయాకోవాల్సిన జాగ్రత్తలు:

కల్లును సూర్యోదయానికి ముందే సేకరించిన నీరా రూపంలో తాగితే అది పూర్తి ఆరోగ్యకరం. ఎండ పెరిగే కొద్దీ అది పులిసిపోయి ఆల్కహాల్‌గా మారుతుంది. పులిసిన కల్లును అతిగా తాగడం వల్ల కాలేయం దెబ్బ తినే అవకాశం ఉంది. అలాగే కల్తీ కల్లు (ఫ్లోరల్ హైడ్రేట్ కలిపినది) ప్రాణాపాయానికి దారితీస్తుంది. కాబట్టి, స్వచ్ఛమైనది మాత్రమే తీసుకోవాలి.

# పల్లెల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం మహిళలే కేంద్రంగా ప్రభుత్వ పథకాల అమలు - ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర మండలం ఇస్లాంపూర్, కోట్ల నరసింహులపల్లి, గర్షకుర్తి రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఇస్లాంపూర్, మల్లాపూర్, వెంకంపల్లి, మధురానగర్, చర్లపల్లి(ఎన్), బూరుగుపల్లి, కోట్ల నరసింహులపల్లి, గర్శకుర్తి, కురిక్యాల, గర్శకుర్తి, గట్టుభూత్కూర్ గ్రామాల్లో రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న స్వశక్తి సంఘం భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

గర్శకుర్తి లో రూ.10 లక్షలు, వెంకంపల్లి లో రూ.5 లక్షల తో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు.

ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే.





**గంగాధర ఏప్రిల్ 08 (జనోదయ) :** గంగాధర మండలంలో పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం ఇస్లాంపూర్, కోట్ల నరసింహులపల్లి, గర్శకుర్తి గ్రామాల్లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ఆయన ప్రారంభించారు. అలాగే గర్శకుర్తి గ్రామంలో రూ.10 లక్షలు, వెంకంపల్లి గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇస్లాంపూర్, మల్లాపూర్, వెంకంపల్లి, మధురానగర్, చర్లపల్లి(ఎన్), బూరుగుపల్లి, కోట్ల నరసింహులపల్లి, గర్శకుర్తి, కురిక్యాల, గట్టుభూత్కూర్ గ్రామాల్లో రూ.10 లక్షలతో నిర్మించనున్న స్వశక్తి సంఘ భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఆయా గ్రామాల లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కొత్త గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసినప్పటికీ, వాటి అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కనీసం గ్రామపంచాయతీలకు సొంత భవనాలు కూడా నిర్మించలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, నూతన గ్రామపంచాయతీలకు భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. మహిళలే కేంద్రంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ప్రతి గ్రామంలో మహిళలు సమావేశాలు నిర్వహించుకునేందుకు స్వశక్తి సంఘ భవనాల నిర్మాణానికి కృషి చేస్తున్నామని అన్నారు. చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో రాము, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సర్పంచులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మహిళ శిశు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**జనోదయ | గంగాధర | ఏప్రిల్ 08:** తెలంగాణ రాష్ట్రంలో మహిళా, శిశు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ కృషి చేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. బుధవారం గంగాధర మండలం మధురనగర్‌లోని ప్రజా కార్యాలయంలో చొప్పదండి నియోజకవర్గానికి చెందిన 140 మంది అంగన్వాడీ టీచర్లకు ఎమ్మెల్యే స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది హాజరు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహార వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఈ స్మార్ట్ ఫోన్లు ఉపయోగపడతాయని తెలిపారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకుని సేవలను మరింత పారదర్శకంగా అందించాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించి మహిళలు,చిన్నారులఆరోగ్యం,పోషణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగాధర సిడిపివో సల్వాజి నర్సింగారాణి, తాసిల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో రాము, అంగన్వాడీ సూపర్వైజర్లు సంతోషి, రేణుక, సుధారాణి, మస్రత్, మిషన్ వాత్సల్య సామాజిక కార్యకర్త కవిత దేవి తదితరులు పాల్గొన్నారు.

# వెల వెల బోతున్న "వార్డ్ సభ్యుల" శిక్షణా తరగతులు





**బుగ్గారం: ఏప్రిల్ 04 (జనోదయ):** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం శేఖల్లలోని రైతు వేదికలో జరుగుతున్న వార్డ్ సభ్యుల శిక్షణా తరగతులు రోజు రోజుకు వెల వెల బోతున్నాయి. బుధవారం జరిగిన మూడో రోజు శిక్షణా తరగతులకు అతి తక్కువ సంఖ్యలో సభ్యులు హాజరు అయ్యారు. పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకునే పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారుల, జిల్లా కలెక్టర్ ల ఆదేశాలు భే ఖాతర్ చేసి మండల అధికారులు నిర్వహిస్తున్న ఈ శిక్షణా తరగతుల పట్ల అందరూ నిరాశ, నిస్పృహ లకు లోనవుతున్నారు.

# ఉత్కంఠ పోరులో గుజరాత్‌దే విజయం..



ఐపీఎల్ 2026 లో భాగంగా దిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో గుజరాత్ టైటాన్స్ ఒక్క పరుగు తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో దిల్లీ 209/8 స్కోరు చేసింది. కేఎల్ రాహుల్ (92; 52 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఆకట్టుకున్నాడు. పాథుమ్ నిశాంక (41; 24 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్) రాణించాడు. చివర్లో డేవిడ్ మిల్లర్ (41*; 20 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించినా దిల్లీకి ఓటమి తప్పలేదు. గుజరాత్ బౌలర్లలో రషీద్ ఖాన్ 3, ప్రసిద్ధ్ కృష్ణ 2, సిరాజ్ ఒక వికెట్ పడగొట్టారు.

**చివరి ఓవర్ సాగిందిలా..**

దిల్లీ విజయానికి చివరి ఓవర్‌లో 13 పరుగులు అవసరం కాగా.. గుజరాత్ 11 పరుగులే చేసి రెండు వికెట్లు కోల్పోయింది. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన ఆ ఓవర్‌లో తొలి బంతికి విప్రాజ్ నిగమ్ ఫోర్ బాది తర్వాత బంతికే ఔటయ్యాడు. మూడో బంతికి సింగిల్ (కుల్‌దీప్) రాగా.. నాలుగో బాల్‌ను మిల్లర్ సిక్సర్‌గా మలిచాడు. చివరి రెండు బంతుల్లో విజయ సమీకరణం రెండు పరుగులు కాగా.. ఐదో బంతికి సింగిల్ తీసే అవకాశమున్నా మిల్లర్ అందుకు నిరాకరించాడు. ఆఖరి బాల్‌కు పరుగులేమీ రాకపోగా.. కుల్‌దీప్ యాదవ్ రనౌటయ్యాడు. దీంతో గుజరాత్ ఆటగాళ్లు సంబరాలు చేసుకున్నారు. ఈ సీజన్‌లో టైటాన్స్‌కు ఇది తొలి విజయం.

తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లలో టాప్4లో ముగ్గురు అర్ధ శతకాలు బాదారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (70; 45 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), జోస్ బట్లర్ (52; 27 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లు), వాషింగ్టన్ సుందర్ (55; 32 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలు సాధించారు. సాయి సుదర్శన్ (12), గ్లెన్ ఫిలిప్స్ (14*) పరుగులు చేశారు. దిల్లీ బౌలర్లలో ముకేశ్ కుమార్ 2, లుంగి ఎంగిడి, కుల్‌దీప్ యాదవ్ ఒక్కో వికెట్ తీశారు.

జనోదయ
మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు, నాయకులు, అభిమానుల పుట్టిన-రోజు, వివాహం, శుభాకాంక్షలు, వ్యాపార ప్రకటనలు మొదలైన అన్ని రకాల డిజిటల్ అడ్స్ కోసం సంప్రదించండి
మానసని కృష్ణారెడ్డి- 8074124190
విజయ్- 7288800624